సాక్షి పెద్దపల్లి

ఆదివారం | 17 | సెప్టెంబర్ | 2023





తిరగబడ్డ పోరుగడ్డ..

- నిజాంకు ఎదురొడ్డి నిలిచిన పల్లెలు
- వెట్టిని ఎదిరించిన విముక్తి పోరాటం
- నిజాం గుండెల్లో ఫిరంగులు మోగించిన యోధులు
- అమరుల త్యాగఫలంతో స్వేచ్ఛావాయువులు..

'బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లేబోతవు కొడుకో నైజాం సర్కరోడా.. నాజీల మించినవురో.. నైజాం సర్కరోడా.' అంటూ.. నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది ఉమ్మడి జిల్లా. నిజాం నిరంకుశ పాలనలో జాగీర్దారులు, మక్తేదారులు, ఇనాందారులు, వతన్ దారుల దుర్మార్గాలు, దౌర్జన్యాలపై వీరోచిత పోరాటం చేసింది. బాంచెన్ కాల్మొక్త అన్న సామాన్యుడే.. బందూక్‌తో గడి పునాదులను పెకలించాడు. ఈ పోరులో ప్రత్యేకంగా నిలిచింది మాత్రం హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్. తిమ్మాపూర్ మండలం పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, రాజన్నసిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు నిజాంకు వ్యతిరేకంగా చేసిన పోరు శ్లాఘనీయం. రజాకార్ల కాల్పుల్లో అనభేరి, భూపతిరెడ్డి అమరులయ్యారు. వీరితోపాటు మరో 10 మంది అమరులయ్యారు. వారి జ్ఞాపకార్థం మహ్మదాపూర్ గుట్టల్లో రెండు సమాధులు నిర్మించారు. ప్రతియేటా వారి వర్ధంతి రోజు సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటారు. ఎందరో మహానుభావులు తెలంగాణ సాయుధ పోరులో పాల్గొని ప్రాణాలను పణంగా పెట్టి చివరకు విజయం సాధించారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణకు విముక్తి లభించింది. నేడు తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అలాంటి వారిని ఒక్కసారి మననం చేసుకుందాం..

- వివరాలు 2 లో

న్యూస్‌రీల్

మట్టి గణపతులనే పూజించాలి



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: గణపతి నవరాత్రుల్లో మట్టిగణపతులనే పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీతో కలిసి మట్టి గణపతులను పంపిణీ చేశారు. పీఓపీ విగ్రహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కాలుష్యనియంత్రణ బోర్డు నుంచి రెండు వేల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా అధికారులు రంగారెడ్డి, మధుసూదనశర్మ, శ్రీకాంత్, సాయినాథ్ ఉన్నారు.

కోలేటి శ్రీవల్లికి గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ తీసుకుంటున్న డాక్టర్ శ్రీవల్లి

కాల్వశ్రీరాంపూర్: కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ పరిధి ఖమ్మంలోని మమత డెంటల్ కళాశాలలో 2022–23 విద్యాసంవత్సరంలో బీడీఎస్ పూర్తి చేసిన డాక్టర్ కోలేటి శ్రీవల్లికి గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. ఒరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచినందుకు మెడల్ వరించింది. రవాణాశాఖ మంత్రి, కళాశాల చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ఈనెల 14న శ్రీవల్లికి మెడల్, ప్రశంసపత్రం అందజేశారు. శ్రీవల్లి తల్లిదండ్రులు శ్రీలత, సంపత్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎస్సై శ్రీనివాస్, ఎంపీడీవో రామ్మోహనాచారి, మెడికల్ ఆఫీసర్ మహేందర్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రాఘవులు, ప్రధాన కార్యదర్శి కోలేటి అశోక్, నార్ల రాజన్న, రామన్న, రాజేంద్రప్రసాద్, ఈశ్వర్ రాజు, వేణు, కిరణ్ అభినందించారు.


జిల్లాలో యూరియా కొరత లేదు



రొంపికుంటలో ఎరువుల షాపులో స్టాక్ రిజిస్టార్ తనిఖీ చేస్తున్న డీఏవో ఆదిరెడ్డి

కమాన్‌పూర్: జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు కొరత సృష్టిస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. యూరియా సరిపడా ఉందని, ఎవరూ కంగారుపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రుణమాఫీ అయిన రైతులు కొత్త రుణం తీసుకునేందుకు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఎక్కువగా ఆయిల్‌పాం సాగు వైపు దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఏవో ప్రమోద్‌కుమార్, ఏఈవోలు యాదగిరి శ్రీనివాస్, సురేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



సూచనలిస్తున్న జిల్లా విద్యాధికారి మాధవి

మంథని: పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని డీఈవో మాధవి సూచించారు. మంథని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)లో జరుగుతున్న శిక్షణ తరగతులను సందర్శించారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నెలవారీగా పరీక్షలు నిర్వహించి గ్రేడింగ్‌ల వారిగా బోధించాలని పేర్కొన్నారు. కోర్స్ డైరెక్టర్ కొమురయ్య, ఎంఈఓ దాసరి లక్ష్మి, మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, అంతర్గాం, రామగుండం, మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబలకు అండగా 'అభయ'

- మహిళలకు సేఫ్‌గా ఆటో ప్రయాణం
- 'అభయ' మొబైల్ యాప్‌తో మరింత భద్రత
- వెయ్యి ఆటోలకు క్యూఆర్ కోడ్, యూనిక్ నంబర్
- ప్రయాణికుల భద్రతపై పోలీసుల నజర్
- స్కాన్ చేస్తే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం
- సద్వినియోగం చేసుకోవాలి: సీపీ రెమా రాజేశ్వరి



ఆటోలకు క్యూఆర్ కోడ్ అతికిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, పోలీస్ అధికారులు

'అర్ధరాత్రి.. గోదావరిఖని బస్టాండ్‌లో ఓ యువతి బస్సు దిగింది. ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. తాను చెప్పిన గమ్యం వైపు కాకుండా ఆటో మరో దారిలో ప్రయాణిస్తోంది. యువతిలో ఆందోళన. ఏంచేయాలో తెలియక సతమతం.. అటుఇటూ చూస్తోంది. భయంతో ఉన్న యువతికి ఆమె ప్రయాణిస్తున్న ఆటోలోనే ఓ యాప్ కనిపించింది. దానిపై 'అభయ' అని రాసి ఉంది. వెంటనే ఆమె ధైర్యం తెచ్చుకుంది. అభయ యాప్ క్యూఆర్ కోడ్‌పై స్కాన్ చేయడంతో ఆటో డ్రైవర్ వివరాలు, ఆటోనంబర్, లైవ్ లొకేషన్‌తో సహా సమాచారం కమాండ్ కంట్రోల్ రూంకు చేరింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆటోను పట్టుకుని యువతిని సేఫ్‌గా ఇంటికి పంపించారు.'



కమిషనరేట్ పరిధిలోని ఆటోలు

గోదావరిఖని: మహిళలు ఆటోల్లో రాత్రిపూట భయంలేకుండా ప్రయాణించేందుకు పోలీసుశాఖ మొబైల్ యాప్ రూపొందించింది. ఇది ఎలాంటి యాప్‌లేకున్నా.. గూగుల్‌పే, ఫోన్‌పే లేదా.. ఫోన్‌లో కెమెరా ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు సదరు ఆటోతోపాటు అన్ని వివరాలూ కమాండ్ కంట్రోల్ రూంకు సమాచారం చేరవేస్తుంది. ప్రధానంగా రాత్రిపూట మహిళలకు ఈ విధానం ద్వారా మరింత భద్రత లభిస్తుంది. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుమారు 12వేల ఆటోలు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 8వేలకు పైగా ఆటోలు నడుస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 6వేలకుపైగా ఆటోలకు స్కానర్ స్టిక్కర్లను అంటించింది పోలీస్‌శాఖ. ప్రయాణ సమయాల్లో ఆకతాయిగా వ్యవహరించే డ్రైవర్ల ఆటకట్టించేందుకు కమిషనరేట్ పరిధిలోని అన్ని ఆటోలకు ఈ క్యూఆర్ కోడ్‌తో కూడిన యూనిక్ నంబర్లను పోలీసులు ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్ ప్రతి ఆటోవాలా పక్కాగా వినియోగించేలా చర్యలు చేపట్టారు. ఆటో నంబర్‌తోపాటు వాహనడ్రైవర్, ఓనర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అందులో నిక్షిప్తం చేస్తున్నారు. వెనుకభాగంలో ప్రయాణిస్తున్న వారికి కనిపించేలా క్యూఆర్ స్కానర్ ఏర్పాటు చేస్తున్నారు.

ఫిర్యాదు ఇలా చేయచ్చు..

- పేటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే, లేటెస్ట్ సెల్‌ఫోన్ కెమెరాలో వస్తున్న స్కానర్ ద్వారా ప్రయాణికులు డైరెక్ట్ స్కాన్‌చేయవచ్చు
- గూగుల్ క్రోమ్ ద్వారా డైరెక్ట్ కెమెరా బటన్ నొక్కి క్యూఆర్ కోడ్‌స్కాన్ చేయవచ్చు.
- ఇవన్నీ లేకపోతే క్యూఆర్ కోడ్ స్కానర్ డౌన్‌లోడ్ చేసుకుని స్కానింగ్ చేసే వీలుంది.
- స్కాన్ చేసిన తర్వాత తప్పనిసరిగా ప్రయాణికులు తమ సెల్ నంబర్ ఎంటర్ చేస్తేనే కమాండ్ కంట్రోల్ రూంకు ఆటోడ్రైవర్, ఆటో నంబర్, లైవ్ లొకేషన్ వెళ్తుంది.

క్యూఆర్‌కోడ్‌లో పూర్తి వివరాలు..

- క్యూఆర్ కోడ్‌లో ఆటో యజమాని లేదా డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి.
- వాహనం పూర్తి వివరాలు స్థానిక పోలీస్‌స్టేషన్, కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేయబడి ఉంటాయి.
- ఆటోలో డ్రైవర్ వెనుకభాగంలో క్యూఆర్ కోడ్, యూనిక్ నంబర్ బోర్డు అమర్చుతారు.
- అత్యవసర కాల్, టెక్ట్స్ మెసేజ్ పంపడం, ట్రేస్ మై లొకేషన్, ఎమర్జెన్సీ కంప్లైంట్, రేటింగ్ అంశాలు ఉంటాయి.
- ప్రయాణికులకు ఆపద సంభవిస్తుంది అనుకునే సమయంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే కమాండ్ కంట్రోల్ రూం, స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వారి లైవ్ లొకేషన్ సమాచారం వెళుతుంది.
- స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆపదలో ఉన్న వారిని రక్షించవచ్చు.
- మద్యం సేవించి వాహనం నడిపినా.. రాష్ డ్రైవింగ్ చేసినా.. ప్రయాణికులతో దురుసుగా, అసభ్యకరంగా ప్రవర్తించినా.. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా.. స్మోకింగ్ చేస్తూ వాహనం నడిపినా.. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేసినా.. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నా.. అనుమానాస్పదంగా వ్యవహరించినా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.
- ప్రయాణికులు తమ వస్తువులను వాహనంలో మరిచిపోయినా ఈ విధానం ద్వారా సులభంగా తెలుసుకోవచ్చును.

'అభయ'తో మరింత భద్రత



అభయ యాప్‌తో మహిళల భద్రతకు భరోసా కలుగుతుంది. మహిళలు ఏ సమయంలోనైనా సురక్షితంగా ప్రయాణించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ప్రయాణంలో ఇబ్బంది అనిపించిన సమయంలో మొబైల్ ఫోన్‌లో అభయ్ అప్లికేషన్ ఓపెన్ చేసి పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. వెంటనే సదరు వాహనం లైవ్ లొకేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుంది. పోలీస్ సిబ్బంది అప్రమత్తమై వాహనాన్ని ట్రేస్ చేసి దగ్గర్లో ఉన్న పోలీస్ అధికారులకు సమాచారం ఇస్తారు. జరగబోయే నేరాలను కట్టడి చేయడంలో ఈ అప్లికేషన్స్ కీలకంగా పనిచేస్తుంది. ప్రతి ఒక్కరు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రెమా రాజేశ్వరి, సీపీ

నేడు తెలంగాణ జాతీయ సమైక్యత వేడుకలు

- కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఇతర అధికారులు
- హాజరుకానున్న 'మండలి' చీఫ్‌విప్ భానుప్రసాదరావు
- ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ఇతర అధికారులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ జాతీయ సమైక్యత వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. ఆ ఏర్పాట్లను శనివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఇతర అధికారులు పర్యవేక్షించారు. ఆది వారం ఉదయం 9 గంటలకు శాసనమండలి చీఫ్‌విప్ తానిపర్తి భాను ప్రసాదరావు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంటనేట శ్రీనివాస్, సూపరింటెండెంట్ బండి ప్రకాశ్, తహసీల్దార్ రాజ్‌కుమార్ తదితరులున్నారు.

వృద్ధుల భద్రతకు వాలంటీర్ కమిటీలు

గోదావరిఖని: వృద్ధుల రక్షణకు వాలంటీర్ కమిటీలు ఏర్పాటు చేస్తామని సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల్లో 40 కమిటీలు వేస్తామన్నారు. వృద్ధుల భద్రతకు వాలంటీర్ల టీం, పోలీసులు కలిసి కృషి చేస్తారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్‌లలో ఉన్న అభద్రతాభావాన్ని తొలగించడం ద్వారా వారిలో విశ్వాసాన్ని నింపుతారన్నారు. వారి ఫిర్యాదులు, సమస్యలను స్థానిక పోలీసులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వృద్ధుల వేధింపులపై గణేశ్ నవరాత్రుల తరువాత ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు.

అపరిచితులతో సెల్‌ఫోన్ ఫ్రెండ్‌షిప్ వద్దు



మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్



మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

- మభ్యపెట్టి మాయ చేసే ప్రమాదం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: సెల్‌ఫోన్, ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులతో స్నేహం పెంచుకోవద్దని, మభ్యపెట్టి మాయచేసే ప్రమాదముందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం మానవ అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపిడీ అంశాలపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి అర్జున్‌తో కలిసి పాల్గొన్నారు. కొందరు మోసగాళ్లు ముఠాగా ఏర్పడి వీడియో కాల్స్, ఇన్‌స్ట్రాగాం, టెలిగ్రాంలో చాటింగ్ చేస్తూ ఎదుటివారి బలహీనతలను గుర్తించి మోసాలకు పాల్పడే అవకాశముందన్నారు. సమావేశంలో శ్రీనివాస్, శంకర్, మూర్తి, అకడమిక్ డైరెక్టర్ అశోక్, రజిత, నరేశ్, ఆనంద్, కుమారస్వామి ఉన్నారు.

మహిళల అక్రమ రవాణా అరికట్టాలి

గోదావరిఖనిటౌన్: మహిళల అక్రమ రవాణాను అరికట్టాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థినుల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. వారికి బ్యాడ్‌టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, న్యాయవాదులు వరలక్ష్మి, మురళీధర్‌యాదవ్, లోక్ అదాలత్ సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గణితం అధ్యాపకుడికి జాతీయస్థాయి గుర్తింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు డాక్టర్ వంగల శ్రీనివాస్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. గణితశాస్త్రంలో 'సమ్ అప్లికేషన్స్ ఆఫ్ గెగెన్ బారో పాలినామియల్స్' అంశంపై రాసిన పరిశోధనాపత్రాన్ని జాతీయస్థాయిలో పేరొందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారితో యూజీసీ గుర్తింపు పొందిన జర్నల్‌లో ప్రచురించడంపై కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య హర్షం వ్యక్తంచేశారు. శ్రీనివాస్‌ను అభినందించారు. సమావేశంలో పరిశోధన పత్రాలు, ప్రచురితమైన జర్నల్ పుస్తకాలను ఆవిష్కరించారు. అధ్యాపకులు నితిన్, కెప్టెన్ రేల్ల సంజీవ్, రవీందర్‌రావు, మనోజ్ కుమార్, రామకృష్ణ, అర్జున్ శ్రీనివాస్‌ను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం



సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పేద, నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పిల్లలకు మేలు జరగనుంది. గ్రామాల్లో ఉదయమే తల్లిదండ్రులు పనులకు వెళ్తుండడం.. అప్పటికి భోజనం చేయకపోవడంతో విద్యార్థులు ఖాళీ కడుపులతోనే పాఠశాలకు వస్తుంటారు. ఆకలి కారణంగా చదువు ఒంటబట్టదని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఉదయం వేళ టిఫిన్ అందించాలని సంకల్పించింది.

పేద విద్యార్థులకు వరం

జిల్లాలో 359 ప్రాథమిక, 195 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒకటో తరగతి నుంచి 10వరకు సుమారు 34,021 మంది చదువుకుంటున్నారు. వీరందరికీ తాజా పథకం కింద లబ్ధి చేకూరనుంది. ఉదయంపూజ టిఫిన్ అందించడం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం రాగిజావ అందజేయడంతోపాటు మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానీ అందజేస్తోంది.

సింగరేణి అధికారుల సంఘంలో విభేదాలు

- సమస్యల పరిష్కారానికి ఎదురుచూపులు
- ప్రస్తుత కమిటీపై తీవ్ర అసంతృప్తి
- నేటి శ్రీరాంపూర్ సమావేశానికి కొందరు దూరం



గోదావరిఖని: సింగరేణి అధికారుల సంఘంలో విభేదాలు పొడచూపాయి. ప్రస్తుత కమిటీ తీరుపై మెజార్టీ నాయకులు గుర్రుగా ఉన్నారు. అధికారుల సంఘం ఎన్నికలు 2019 జనవరిలో జరిగాయి. 2021తో గడువు ముగిసింది. అప్పటినుంచి ఎన్నికలు నిర్వహించకపోవడంతో అధికార సంఘం నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. సింగరేణిలోని 12 ఏరియాల్లో 2,300 మంది అధికారులు పనిచేస్తున్నారు. ఏరియాలవారీగా సమస్యల పరిష్కారానికి అధ్యక్షుడితోపాటు కమిటీని ఎనుకున్నారు. సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంఓఏఐ) అనుబంధంగా సింగరేణి అధికారుల సంఘం కొనసాగుతోంది. గతంలో రెండు సందర్భాల్లో ఏరియా అధ్యక్షులను మార్చాలని సీఎంఓఏఐ నాయకులు సిఫారసు చేయడంపై విభేదాలు మొదలయ్యాయి.

ఎన్నికల కోసం ఎదురుచూపులు

కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ పదికాలం ముగిసి రెండేళ్లు దాటింది. ఇప్పటికే రెండుసార్లు సమావేశమై ఎన్నికల ప్రస్తావన తెచ్చినా నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలో ఈనెల 17న ఆదిలాబాద్ జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి అధికారుల సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. బైలాస్ ప్రకారం ప్రత్యక్ష ఎన్నికల ద్వారా అధ్యక్షుడిని ఎన్నుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది. గతంలో కేవలం కమిటీ ముఖ్య నాయకులు, పాత కమిటీ నాయకులకు మాత్రమే ఓటు హక్కు ఉంది. ఈ లెక్కన సింగరేణిలో 12 ఏరియాల నుంచి ఏరియాకు ఐదుగురు చొప్పున 60మంది, సింగరేణి కమిటీలో ఇప్పటివరకు కొనసాగిన 11మందికి ఓటు హక్కుద్వారా కమిటీ ఎంపిక పద్ధతి కొనసాగుతోంది. దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. గడువు ముగిసినా ఎన్నికలకు వెళ్లకుండా కాలయాపన చేస్తున్నారనే కారణంతో కొన్ని ఏరియాల కమిటీల అధ్యక్షులు దీనికి దూరంగా ఉండాలని నిర్ణయించారు. దీంతో సగానికిపైగా హాజరు కాకపోవచ్చని అంటున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు అల్ఫోర్స్ విద్యార్థిని


విద్యార్థిని అభినందిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎం.శ్రీహాసిని రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం విద్యార్థిని పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సైన్స్ మ్యూజియంలో ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో శ్రీహాసిని విశేష పరిజ్ఞానాన్ని ప్రదర్శించి ప్రథమ బహుమతి గెలుపొందడంతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు విద్యతో పాటు వివిధ అంశాల పట్ల ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


బుచ్చయ్య(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై శనివారం లారీ కిందపడి పాడి రైతు అమ్ముల బుచ్చయ్య(56) మృతిచెందాడు. ఎస్సై విజేందర్, స్థానికుల వివరాలు.. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ నుంచి ఇటుక లోడ్‌తో లారీ కరీంనగర్ వైపు వెళ్తుండగా, ఎలిగేడు మండలం శివపల్లికి చెందిన పాడి రైతు బుచ్చయ్య పశువుల మేత కోసం కాట్నపల్లి పరిధిలోని పొలాల్లో గడ్డి కోసుకొని ద్విచక్ర వాహనం(ఎక్సెల్)పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాట్నపల్లి వద్ద శివపల్లి వైపునకు రోడ్డు దాటుతుండగా, గమనించిన లారీ డ్రైవర్ సైడ్ తీసుకొని వెళ్లి మళ్లీ వెనక్కి రావడంతో బుచ్చయ్యను తప్పించబోగా లారీ రోడ్డుపక్కన బోల్తా పడింది. లారీ కింద పడిన బుచ్చయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన స్థలానికి సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ, ఎస్సై విజేందర్ చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈప్రమాదంతో దాదాపు గంటసేపు ట్రాఫిక్ అంతరాయం కలుగగా, పోలీసులు క్రమబద్ధీకరించారు. మృతుడికి భార్యతో ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు..


విజయ్‌కుమార్ మృతదేహం

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధి దొంతులవాడకు చెందిన కొమురవెల్లి విజయ్‌కుమార్ (68) శనివారం తన ఇంట్లోని బావిలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఎస్‌ఐ కిరణ్ వివరాలు.. విజయ్‌కుమార్ ఇంటి ఆవరణలోని బావి వద్దకు స్నానం చేసేందుకు వెళ్లగా, ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయాడు. శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే బావిలో నుంచి పైకి తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ తిరుపతి(27) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాలు.. తిరుపతి కరీంనగర్ కార్పొరేషన్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో బొటనవేలు, కాళ్లలో రాడ్ వేశారు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 11న గొల్లపల్లికి వచ్చి, మరుసటి రోజు రాత్రి పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 14న పరిస్థితి విషమించడంతో మరో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఏడాది వయస్సు గల పాప ఉంది.

కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రాబోయే సింగరేణి ఎన్నికల్లో సంస్థలో పనిచేస్తున్న 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్‌సీసీడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.విశ్వనాథ్ శనివారం ఆర్జీ-2 డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ, 11వ వేజ్‌బోర్డ్ ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు అలవెన్స్ అమలు చేయాలన్నారు. సింగరేణి లాభాల్లో భాగస్వామ్యమైన కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, కుటుంబ సభ్యులందరికీ వైద్య సదుపాయం, 8 గంటల పనిదినాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇ.రాంజేదర్, ఐలయ్య, ప్రసాద్, వెంకటయ్య, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.





తిరగబడ్డ పోరుగడ్డ..!

- నేలకొరిగిన వందలాది మంది యోధులు
- పోరు చరిత్రలో ఉమ్మడి జిల్లాది ప్రముఖపాత్ర
- సాయుధ పోరాటానికి తలవంచిన నిరంకుశత్వం
- నేడు తెలంగాణ విమోచన (విముక్తి) దినోత్సవం

కరీంనగర్: 'బాంచెన్.. కాల్మొక్తాదొరా.. అన్నవారే భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఉమ్మడి జిల్లా తిరగబడింది. రజాకార్లను తరిమికొట్టింది. ఇక్కడి ప్రజలు ఎక్కడికక్కడ వలుగు, పార, చేతికి ఏది దొరికితే దాంతోనే పోరుబాట పట్టారు. సాయుధ గెరిల్లాలుగా, నాయకులుగా అగ్రభాగాన నిలిచారు.

తిరుగుబావుటా 'గాలిపెల్లి'

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం గాలిపెలికి తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత చరిత్ర ఉంది. నిజాం రాజ్యహింసకు ఒకేరోజు పదకొండు మంది ప్రాణాలర్పించిన ఆ నేల రక్త సింధూరమైంది. నిజాంకు వ్యతిరేకంగా పోరుచేస్తున్న బద్దం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో నిజాం ఆధీనంలోని ప్రైవేటు సైన్యం రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెలు తిరగబడ్డాయి. జనం కొడవళ్లు, గొడ్డళ్లు, బరిసెలు, గుల్లెర్లతో పోరుసాగించారు. నిజాం పోలీసులు, రజాకార్లపై తిరుగబడిన గాలిపెల్లిలో భీకరపోరు సాగింది. ఆ పోరులో గాలిపల్లితో పాటు సమీప గ్రామాలకు చెందిన పదకొండు మంది ఒకే రోజు అమరులయ్యారు. పీసు బక్కయ్య, బద్దం నారాయణ, బుర్రయ్య, పుల్లుగారి ఎల్లయ్య, అల్లెం వెంకయ్య, తాళ్లపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి, నర్సక్కపేటకు చెందిన ఎలేటి రాజిరెడ్డి, సోమారంపేటకు చెందిన ఐరెడ్డి భూంరెడ్డి, బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన తుమ్మోజి నారాయణ అమరులయ్యారు. రజాకార్ల దాడిలో బద్దం ఎల్లారెడ్డి, రాజలింగం, అమృత్‌లాల్‌శుక్లా తప్పించుకోవడంతో ఆగ్రహంతో రజాకారులు గాలిపెల్లిని తగులబెట్టారు.

సాయుధవీరులు అసువులు బాసిన నేల

తెలంగాణ విముక్తి కోసం.. నిజాం ప్రభుత్వ అరాచక పాలనను ఎదిరించిన సాయుధ పోరాటవీరులు.. హుస్నాబాద్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉంది. పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు రజాకార్లతో పోరుచేస్తూ మహ్మదాపూర్‌కు చేరుకున్నాయి. 14 మార్చి 1948లో మహ్మదాపూర్‌లో సమావేశం అయ్యారు. ఆ సమయంలో పోలీస్ పటేల్ వారిని భోజనానికి పిలిచి ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి తెలిపారు. రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టి కాల్పులు జరపడంతో 12 మంది అమరులయ్యారు. వీరుల జ్ఞాపకార్థం అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి పేరుతో రెండు సమాధులు నిర్మించారు. ప్రతియేటా వారి వర్ధంతి రోజు సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకుంటారు.

రణభేరి మోగించిన 'అనభేరి'

అనభేరి ప్రభాకర్‌రావు.. 1910 ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పోలంపెల్లి గ్రామంలో జమీందారి కుటుంబంలో జన్మించారు. సాయుధ పోరాటంలో తొలి దళ నాయకుడిగా తుపాకీ పట్టి పేదలకు బాసటగా నిలిచారు. రజకార్ల ఆకృత్యాలు, అరాచకాల నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలనే లక్ష్యంతో జాగీర్‌దార్ వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేశారు. రజకార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. చివరకు 1948 మార్చి 14న హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో నిజాం ప్రభుత్వం జరిపించిన కాల్పుల్లో అమరుడయ్యారు.


హుస్నాబాద్‌లో నెలకొల్పిన అనభేరి కాంస్య విగ్రహం(ఫైల్)


సాయుధ దళాలు (ఫైల్)

కొదురుపాక యోధులు


కేశవరావు (ఫైల్)


ఆనందరావు (ఫైల్)

బోయినపల్లి: రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన జోగినిపల్లి కేశవరావు, మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు ఆధ్వర్యంలో నైజాం, రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమానికి తెరలేపారు. 1920లో జన్మించిన జోగినిపల్లి కేశవరావు.. వ్యవసాయంతోపాటు సోషల్ వర్క్ చేసేవారు. 1940లో సాయుధ దళాలకు ఆయుధాలు సమకూర్చేవారు. మహారాష్ట్ర చాందా, నాగ్‌పూర్ నుంచి ఆయుధాలు సేకరించి ఇక్కడి దళాలకు అందించేవారని చెబుతుంటారు. ఈ క్రమంలో మూడుసార్లు వరంగల్ జిల్లాలో జైలు జీవితం గడిపారు. కేశవరావుకు భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారుడు జోగినిపల్లి శ్రీనివాసరావు, కూతుళ్లు శోభమ్మ, శశికళ, స్వర్ణలత సంతానం. పెద్ద కుమార్తె శోభమ్మ ఇప్పటి సీఎం కేసీఆర్ భార్య.

ఆనందరావు పేరిట స్మారకస్తూపం

మాన్వాడకు చెందిన జోగినిపల్లి ఆనందరావు పేరు సాయుధపోరు చరిత్రలో నిలిచింది. 1921లో జన్మించిన ఆనందరావు బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. ఈయన తెలంగాణ పల్లెల్లో నిజాం ప్రభుత్వ ఆరాచకాలను జీర్ణించుకోలేదు. సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరులో చురుకుగా పాల్గొన్నాడు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావుకు మేనమామ అయిన ఆనందరావు సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన సాయుధ పోరులో కీలక పాత్ర పోషించారు. ఆరు నెలలు జైలు జీవితం గడిపారు. హైదరాబాద్ సంస్థానం విలీనం అయ్యాక ఆనందరావు సేవలకు ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించి సత్కరించింది.

పోరులో 'చెన్నమనేని'


రాజేశ్వర్‌రావు (ఫైల్)

విద్యార్థి దశ నుంచే చెన్నమనేని ఉద్యమ సేనానిగా మారారు. అప్పటి విద్యార్థి సంఘం సిటీ కాలేజీ కార్యదర్శి రఫీ అహ్మద్‌తో 1947 ఆగస్టు 15న కళాశాలపై జెండా ఎగురవేయించారు. పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే మారువేశంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన యోధుడు. నిజాం పోలీసులు 3 అక్టోబర్ 1947 నుంచి ప్రీవెంటివ్ డిటెన్షన్ వారంట్ జారీచేయగా.. అజ్ఞాతంలో ఉంటూనే విలీనోద్యమంలో పాల్గొన్నారు. చంచల్‌గూడ, గుల్బర్గా జైలులో ఏడాది మగ్గారు.

కొరియర్‌గా 'దేశిని'


చినమల్లయ్య(ఫైల్)

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన దేశిని చిన మల్లయ్య అనభేరి ప్రభాకరరావు దళానికి కొరియర్‌గా పనిచేశారు. పరిసర గ్రామాల్లో తిరగడం.. వివరాలు సేకరించి, దళానికి చేరవేయడం ఈయన బాధ్యత. విలీనం తరువాత సీపీఐలో కొనసాగుతూ నాలుగు సార్లు సర్పంచ్, ఒకసారి సమితి ప్రెసిడెంట్, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగారు.

విద్యార్థిగానే జువ్వాడి గౌతంరావు పోరు


గౌతంరావు (ఫైల్)

విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. విలీనోద్యమంలో పాల్గొని కరీంనగర్, వరంగల్ జైళ్లలో శిక్ష అనుభవించారు. 1947లో ఔరంగాబాద్ జైలు నుండి తప్పించుకొని వచ్చి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. బద్దం ఎల్లారెడ్డి వంటి వీరుల మార్గదర్శకత్వంలో పనిచేశారు.

అజ్ఞాతంలో ఉంటూనే బోవెరా ఉద్యమం


వెంకటరామారావు(ఫైల్)

1947 అక్టోబర్ 2న అనేక గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు జరిపిన యోధుడు. సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని ఊరూరా ప్రచారం చేశారు. బెజ్జంకి గోదాం లూటీ చేయించడంలో కీలకపాత్ర పోషించారు. నిజాం పోలీసులు, రజాకార్లు తోటపల్లిలోని ఆయన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు.

స్ఫూర్తి ప్రదాత.. బద్దం ఎల్లారెడ్డి


ఎల్లారెడ్డి (ఫైల్)

గాలిపెల్లికి చెందిన బద్దం హన్మంతరెడ్డి, లచ్చవ్వ దంపతులకు 1906లో జన్మించారు బద్దం ఎల్లారెడ్డి. యుక్త వయసులోనే కమ్యూనిజం భావజాలాన్ని ఒంట బట్టించుకున్నారు. గెరిల్లా దళాలకు మానాల క్యాంపులో శిక్షణ ఇచ్చారు. 1948 మార్చి 12న ఇల్లంతకుంట పోలీసు క్యాంపుపై దాడి చేసి ఎస్సైతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. పేదల అప్పు పత్రాలను పెత్తందార్ల నుంచి తెచ్చి ప్రజల సమక్షంలో కాల్చివేశారు. 1951లో జరిగిన తొలి ఎన్నికల్లోనే పీడీఎఫ్ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి బద్దం ఎల్లారెడ్డి విజయం సాధించారు. అప్పుడు ఆయన ప్రత్యర్థి పీవీ.నర్సింహరావు.

సామాన్యులే.. సాయుధులై

సిరిసిల్లకల్చరల్: సాయుధ పోరులో నిజాం వ్యతిరేక ఉద్యమకారులు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. సింగిరెడ్డి భూపతిరెడ్డి లక్ష్మీపూర్ తాళ్లల్లపల్లి ఆర్య సమాజ్, వందేమాతరం, స్టేట్ కాంగ్రెస్‌లో పనిచేశారు. రాత్రిపూట పాఠశాలల్లో విద్యను వ్యాప్తి చేశారు. రైతులకు జరిగే అన్యాయాలను ఎదిరించారు. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటాలకు దిగారు. మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి వీరమరణం పొందారు.

ఆంధ్ర మహాసభతో స్ఫూర్తి

1935 సెప్టెంబర్ 6న సిరిసిల్లలో నాలుగో ఆంధ్ర మహాసభను నిర్వహించారు. ఉపాధ్యాయుడు అమృతలాల్‌శుక్లా. మాడపాటి హన్మంతరావు అధ్యక్షత వహించిన ఈ సభలో బూర్గుల రామకృష్ణారావు, కేవీ.రంగారెడ్డి, జేవీ నర్సింగరావు, సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డి వంటి రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొని స్ఫూర్తి రగిలించారు. వందలాది యువకులు, విద్యార్థులు ఉద్యమంలో పాల్గొన్నారు. కోడి రామకృష్ణ బల ప్రదర్శన ఈ సభకు ప్రత్యేక ఆకర్షణ అయింది. ఆంధ్ర మహాసభ కార్యకర్తలకు అన్నం పెడుతున్నారని బండపెల్లికి చెందిన గడ్డం రాఘవరెడ్డి ఇల్లును పోలీసులు లూటీ చేశారు. రుద్రంగి నర్సింగరావు, వై.హన్మంతరావు, అమృతలాల్‌శుక్లా తదితరులు సిరిసిల్ల, రుద్రంగి, లింగంపేట, సనుగుల, మల్యాల, ఎనుగంటి, బావుసాయిపేట, మామిడిపల్లి, కనగర్తి, హనుమాజీపేట, మల్లారం, మూడపల్లి, బాలరాజుపల్లి, నూకలమర్రి, మర్రిపెల్లి, నెమలికొండ గ్రామాల్లో జాతీయ జెండాలెత్తి ఉద్యమానికి ప్రజల్లో ఉత్తేజం కలిగించారు. చెన్నమనేని రాజేశ్వరరావు 1939లో ఏడో తరగతిలో ఉండగానే వందేమాతరం ఉద్యమంతో ప్రభావితుడయ్యారు. వీరికి స్వయానా బావ అయిన పొల్కంపల్లి వెంకటరామారావు ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లాకు అధ్యక్షులు. రాజేశ్వరరావు 1942లోనే స్కాలర్స్ డిబేటింగ్ సొసైటీ పేరుతో విద్యార్థి సంఘాన్ని ప్రారంభించారు. కోనరావుపేటకు చెందిన సీహెచ్.రాజలింగం రజాకర్ల క్యాంపుపై త్రివర్ణ పతాకం ఎత్తి పారిపోయాడు. మడుపు రాజిరెడ్డి, మర్రిగడ్డ సాయన్న తదితరులు నిర్బంధ లెవీ ధాన్యం వసూలుకు వ్యతిరేకంగా విలీనోద్యమంలో పాల్గొన్నారు.

కోరుట్ల కోట బురుజుల సాక్షిగా..


గొనె శంకర్

కోరుట్ల: కోరుట్ల కోట బురుజుల కిందిభాగంలో ఉన్న వాగు ఆనుకుని ఉన్న అవతలి ప్రదేశంలో రజాకార్ సైన్యం తిష్ట వేసిందన్న విషయం తెలుసుకున్న కస్తూరి ఎల్లప్ప ఆయన సహచరులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. రాత్రి వేళ వాగుకు ఇవతల వైపు ఉన్న చెట్లకు దివిటీలు కట్టడంతోపాటు కొంత మంది దివిటీలు పట్టుకుని అటు..ఇటు తిరుగుతూ డప్పుల చప్పుళ్లు చేస్తూ ఇండియన్ మిలటరీ కోరుట్ల కోట బురుజుల సమీపంలో ఉన్నట్లు.. గ్రామస్తులు వారికి స్వాగతం పలుకుతున్న వాతావరణాన్ని సృష్టించారు. ఈ క్రమంలో వాగుకు అవతల వైపు ఉన్న రజాకార్ మూకలు ఇండియన్ మిలటరీలో ఓ భాగం కోరుట్లకు వచ్చి ఉంటుందన్న భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది.

అప్పుడు నాకు పదహారేళ్లు: శంకర్, కోరుట్ల

కస్తూరి ఎల్లప్ప కోరుట్లలో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభించిన సమయంలో నాకు పదహారేళ్లు. నేను ఆర్ఎస్ఎస్ శిక్షణకు వెళ్లేవాడిని. రజాకార్లు వచ్చారని ఎల్లప్పతో పాటు కొంత మంది వాగు వెంబడి ఇండియన్ మిలటరీ ఉందన్న రీతిలో అలజడి చేశారు. దీంతో రజాకార్లు వెళ్లిపోవడంతో కోరుట్లకు భయం తప్పింది.

పోరుబాటలో గట్టెపల్లి బిడ్డ


మురళి (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లికి చెందిన మురళీధర్‌రావు సాయుధ దళ సభ్యుడిగా ఉండి నిజాం రజాకార్లను ఎదుర్కొన్నారు. అనభేరి ప్రభాకర్‌రావుతో కలిసి రజాకార్లపై దాడులు చేశారు. 1943లో కమ్యూనిస్టులో చేరిన మురళి.. గొరెల్లి జమిందారి నర్సుబాయమ్మ దౌర్జన్యాలను ఎదిరించి విజయం సాధించారు. మహ్మదాపూర్ గుట్టలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మురళి గుట్టపై నుంచి దూకి తప్పించుకున్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయడంతో మురళీపై పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. అలుపెరగని పోరాటం చేసిన మురళీధర్‌రావు 1988 జూన్ 2న మృతిచెందారు.

మాటపడాల్సి వస్తుందని.. మనస్తాపం చెంది..

- రైస్‌మిల్ ఆపరేటర్ బలవన్మరణం


సమ్మయ్య(ఫైల్)


రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మహిళా సంఘం సభ్యుల లోన్ డబ్బులు బ్యాంకులో కట్టేందుకు వెళ్తుండగా.. దారిలో డబ్బు పడిపోవడంతో మాట పడాల్సి వస్తుందని మనస్తాపం చెందిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లె గ్రామానికి చెందిన గడిపల్లి సమ్మయ్య (33) గ్రామశివారులోని రైస్‌మిల్లులో ఆపరేటర్. అతడి భార్య సృజన మహిళ స్వశక్తి సంఘంలో సభ్యురాలు. బ్యాంక్ ద్వారా తీసుకున్న లోన్ కట్టేందుకు సంఘం సభ్యులు నెలవారీగా వంతు పెట్టుకున్నారు. ఈక్రమంలో ఈనెల లోన్ కట్టే వంతు సృజనకు రాగా, 14వ తేదీన రూ.22వేలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు సమ్మయ్య వెళ్తుండగా, దారిలో ఎక్కడో డబ్బులు పడిపోయాయి. దీంతో డబ్బులు కట్టకపోతే గ్రూపు సభ్యులతో ఎక్కడ మాట పడాల్సి వస్తుందో అని మనస్తాపం చెందిన సమ్మయ్య శనివారం వేకువజామున రైస్‌మిల్లులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఏడాదిలోపు వయస్సుగల పాప ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు పట్టాలపై ప్రైవేట్ ఉపాధ్యాయుడి మృతదేహం


వరప్రసాద్‌శర్మ(ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం రైల్వే పట్టాలపై పడి ఉండగా శనివారం స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన కామారపు వెంకటలక్ష్మి సుబ్రహ్మణ్య సీతారామాంజనేయ వరప్రసాద్‌శర్మ(54) ప్రైవేట్ ఉపాధ్యాయుడు. శనివారం ఉదయం కరీంనగర్ రైల్వేస్టేషన్ శివారులోని రైల్వే పట్టాలపై తల తెగిపోయి మొండెం కన్పించింది. రైల్వేపోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆధారాలు లభించలేదు. శుక్రవారం రాత్రి కరీంనగర్ నుంచి కాచిగూడ వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోషల్ మీడియాలో మృతి సమాచారం రావడంతోకుటుంబసభ్యులు గుర్తించి రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతికి సమాచారం అందించారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం ప్రమాదమా, ఆత్మహత్య అనే విషయాన్ని నిర్ధారిస్తామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సామాజిక తనిఖీలో అక్రమాల వెల్లువ

- బాధ్యులైన అధికారులకు నోటీసులు: డీఆర్‌డీవో పీడీ శ్రీధర్


రికార్డులు అప్పజెప్పని పంచాయతీ ఏఈని ప్రశ్నిస్తున్న డీఆర్‌డీవో పీడీ

ముత్తారం(మంథని): ముత్తారం మండలం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు అక్రమాలు వెలుగుచూశాయి. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో ఉపాధి పథకం కింద 2021 మార్చి 1 నుంచి 2023 మార్చి 1 వరకు రూ.7.01 కోట్ల వ్యయంతో 543 పనులు చేపట్టారు. వీటిపై 13వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఈనెల 10 నుంచి 15 వరకు గ్రామ సభలు నిర్వహించారు. ప్రజావేదికలో బహిర్గతమైన పలు అక్రమాలను డీఆర్‌డీవో పీడీ శ్రీధర్ వెల్లడించారు. మండలంలోని పోతారం, హరిపురంలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.2,33,995 పనుల రికార్డులను సామాజిక తనిఖీకి అప్ప చెప్పకపోవడంపై సెక్షన్ అధికారి నర్సయ్యను ప్రశ్నించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.2.74 కోట్ల పనులకు సంబంధించిన రికార్డులను సైతం అప్పగించకపోవడంపై ఏఈ వరలక్ష్మిని నిలదీశారు. రెండు శాఖలకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు 12 గ్రామాల్లో పనుల కొలతల్లో తేడాలు, కూలీల మస్టర్ నమోదులో పొరపాట్లు, తదితర కారణాలతో ప్రజావేదికలో క్షేత్ర సహాయకులకు రూ.34,374 రికవరీ విధించామని డీఆర్‌డీవో పీడీ తెలిపారు.

గ్రామాలవారీగా..

మండలంలోని పారుపల్లి శాలగుండ్లపల్లిలో రూ.3.32లక్షలతో 17వేల మొక్కలు నాటగా 13 మొక్కలు ఉన్నాయని, చెరువుకట్ట వద్ద 500 మీటర్ల పనులకు 86 మీటర్ల మాత్రమే జరిగిందని, రూ.1.45 లక్షలు తేడా వచ్చినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించగా డీఆర్‌డీవో పీడీ స్పందిస్తూ పంచాయతీ అధికారి, టెక్నికల్ అధికారికి సంజాయిషీ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఓడెడ్‌లో తవ్విన కందకాలు లేనందున రూ.1,34 లక్షలు వృథా అయ్యాయని ప్రజావేదికలో వివరించారు. రైతులు, ఇసుక క్వారీలతో కనుమరుగు అయ్యాయని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ కొమురయ్య, మండల సర్పంచుల కన్వీనర్ కుమార్, ఎంపీవో వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.